27న మలికిపురంలో జిల్లా స్థాయి చెకుముకి పరీక్ష

ప్రజాశక్తి – రాజోలు

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా స్థాయి చెకుముకి పరీక్ష మలికిపురం ఎంవిఎన్‌జెఎస్ అండ్ ఆర్‌విఆర్ కళాశాల్లో ఈ నెల 27 ఆదివారం నిర్వహిస్తారని నిర్వాహకులు జనవిజ్ఞాన వేదిక మలికిపురం మండల శాఖ అధ్యక్షుడు పివివి.వర ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో చెకుముకి పరీక్షలో విజేతలుగా నిలిచిన ప్రయివేటు మరియు ప్రభుత్వ పాఠశాలల బృందాలు జిల్లా స్థాయి పరీక్ష కోసం 27న ఆదివారం ఉదయం 9 గంటలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన తెలిపారు. జనవిజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న ఈ చెకుముకి పరీక్ష విద్యార్థులకు ఉపయోగపడుతుందన్నారు. ఎన్నో నూతన ఆవిష్కరణలకు, విద్యార్థుల్లో నైపుణ్యం పెరిగేందుకు దోహదపడుతుందని అన్నారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని ఆయన అన్నారు.

ఇకపై స్మార్ట్‌గా దోపిడీ

విద్యుత్ వినియోగదారులపై కూటమి సర్కారు 'స్మార్ట్'గా మరో భారాన్ని మోపేందుకు వేగంగా పావులు కదుపుతోంది. విద్యుత్ స్మార్ట్ మీటర్ల బాంబును త్వరలో పేల్చనుంది. ప్రతిపక్షంలో ఉండగా వ్యతిరేకించిన కూటమి సర్కారు... అధికారంలోకి వచ్చిన తరువాత గత సర్కారు బాటలోనే పయనిస్తోంది. ఇందులో భాగంగా స్మార్ట్‌మీటర్ల నిర్వాహణ కోసం ప్రయివేటు ఏజెన్సీల ఆధ్వర్యంలో మంగళవారం పెద్ద ఎత్తున నియామకాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించింది.

- విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు సన్నద్ధం
- ఇకపై రీఛార్జ్ చేస్తేనే కరెంట్ సరఫరా
- సిబ్బంది నియామకానికి ప్రయివేటు ఏజెన్సీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూల నిర్వహణ

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలకు నడుం బిగించింది. విద్యుత్ సంస్థ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు దిశగా అడుగులు వేస్తోందా..? అనే ప్రశ్నకు ఔననే సమాధానం వినిపిస్తోంది. తూర్పు విద్యుత్ సంస్థ ఇప్పటికే అదానీ స్మార్ట్ మీటర్లు పెద్ద ఎత్తున చేరిన విషయం విదితమే. గత ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటు దిశగా అడుగులు వేసినపుడు ప్రతిపక్ష నేతగా తెలుగుదేశం అధినేత చంద్రబాబు తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం గత సర్కారు తీసుకున్న విధానాన్ని అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ఓ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా మంగళవారం నగరంలోని గేదెల నూకరాజు కళ్యాణ మండపంలో ఇంటర్వ్యూల ప్రక్రియ కొనసాగింది. తూర్పు విద్యుత్ సంస్థ పరిధిలోని నాలుగు జిల్లాల నుంచి వేలాది మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. అర్హత ప్రాతిపదిక మినహా పోస్టుల సంఖ్య ఏజెన్సీ వివరాలను సైతం కనీసం వెలుగులోకి రానీయకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకున్నారు.

డిసెంబరు నుంచే స్మార్ట్ మీటర్ల బిగింపునకు రంగం సిద్ధమవుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 18 లక్షలకు పైగా విద్యుత్ సర్వీసులున్నాయి. రోజువారీ విద్యుత్ వినియోగం 18 మిలియన్ యూనిట్ల నుంచి 20 మిలియన్ల యూనిట్ల వరకూ ఉంటుంది. ఈ సంఖ్యలో అత్యధిక మంది గృహ వినియోగదారుల కనెక్షన్లే ఉన్నాయి. తాజా నిర్ణయం నేపథ్యంలో ప్రతి ఇంటికీ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు కానున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకూ ప్రతి నెల విద్యుత్ వినియోగించిన అనంతరం మీటరు రీడింగ్ ఆధారంగా వినియోగదారులు బిల్లులు చెల్లించడం పరిపాటి. ఇకపై విద్యుత్ కావాలంటే ముందుగానే రీఛార్జ్ చేయించుకోవాల్సి ఉంటుంది.

గేదెల నూకరాజు కళ్యాణమండపంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరైన నిరుద్యోగులు

రీఛార్జ్‌లో బ్యాలన్స్ లేనిపక్షంలో సరఫరా నిలిచిపోయే ప్రమాదమూ లేకపోలేదు. ఇప్పటికే జిల్లాలో విద్యుత్ ఛార్జీలు చెల్లించలేక ఆక్వా, పౌల్ట్రీ పరిశ్రమలు చతికిల పడ్డాయి. ప్రభుత్వ సబ్సిడీల కోసం ఎదురు చూస్తున్నాయి. మరోవైపు రైతులకు ఉచిత విద్యుత్ కొన్ని గంటలకే పరిమితమైంది. తాజా నిర్ణయంతో ఇకపై వినియోగదారులకు గోరుచుట్టుపై రోకలి పోటులా మారనుంది. ఓ వైపు విద్యుత్ కోతలు, మరోవైపు సర్‌ఛార్జీల బాదుడుతో సతమతమవుతున్న వినియోగదారులపై 'స్మార్ట్'గా మరో భారం మోపేందుకు కూటమి సర్కారు సమాయత్తమవుతోంది. గృహ వినియోగదారులతో పాటు పరిశ్రమలు, ఇతర రంగాలపైనా తీవ్ర ప్రభావం పడనుంది. ఈ విధానంపై ఇప్పటికే పలు మార్లు వినియోగదారులు ఆందోళనలు చేసిన విషయం విదితమే. అయినప్పటికీ ప్రభుత్వం స్మార్ట్ దిశగా అడుగులు వేయడం విద్యుత్ వినియోగదారులను ఆందోళనకు గురి చేస్తోంది. తాజాగా స్మార్ట్ మీటర్ల బిగింపు, రీఛార్జి, పర్యవేక్షణ తదితర పనులకు ప్రయివేట్ ఏజెన్సీలు ఇంటర్వ్యూలను నిర్వహించాయి. వీటి ద్వారా ఎంపిక చేసిన అభ్యర్థులకు వారి స్థాయి ఆధారంగా పోస్టులను బట్టి రూ.25 వేల నుంచి రూ.45 వేల వరకూ నెలవారీ వేతనం చెల్లించేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. రంతా విద్యుత్ సంస్థలో పర్మినెంట్ ఉద్యోగుల పర్యవేక్షణలో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే వీరి విధివిధానాలను ఇంకా ప్రకటించలేదు.

అంబాజీపేటలో దంపతుల ఆత్మహత్య

అనారోగ్య సమస్యలు, అప్పుల బాధలే కారణం

ప్రజాశక్తి – అమలాపురం, అంబాజీపేట

అనారోగ్య సమస్యలతో, అప్పుల బాధతో మంగళవారం దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలు ఇవి.. ఒకప్పుడు ఎంతో గొప్పగా బతికిన కుటుంబం వారిది. రూ.కోట్ల ఆస్తులు.. పెద్ద ఎత్తున వ్యాపారం పదిమందికి ఉపాధి కల్పించే కుటుంబం మొత్తం ఆత్మహత్యలు చేసుకుని చనిపోయిన ఘటన అంబాజీపేటలో వెలుగు చూసింది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట పెద్ద వీధిలో గల ప్రముఖ వ్యాపారి పాబోలు రామ సుబ్రహ్మణ్యం(రాంబాబు)(60), నాగమణి(57)దంపతులు మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటనతో అంబాజీపేటలో విషాదఛాయలు అలముకున్నాయి. తాము అనారోగ్యం పాలయ్యామని, అలాగే అప్పుల బాధలు కూడా ఉండడంతో ఆత్మహత్యకు పాల్పడుతున్నామని దంపతులు రాసిన సూసైడ్ నోట్ లో పేర్కొన్నారని పోలీసులు తెలిపారు. సంఘటన స్థలాన్ని అంబాజీపేట ఎఎస్‌ఐ సూర్యనారాయణ పరిశీలించి కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మామిడికుదురు

రాంబాబు, నాగమణి (ఫైల్ ఫొటో)

ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ కూడా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రాంబాబు గతంలో కొబ్బరి కురిడి, కొబ్బరి నూనె వ్యాపారం చేసేవారు. ప్రస్తుతం రెడీమేడ్ దుస్తుల వ్యాపారం నిర్వహిస్తున్నారు. పదిమందికి ఉపాధి చూపిన కుటుంబం ఇలా ఆత్మహత్య చేసుకుని చనిపోవడంతో రాంబాబు దగ్గర పని చేసే కార్మికులు ఇక మాకు దిక్కు ఎవరూ అంటూ రోదిస్తున్నారు.

అయితే 2013లో పాబోలు రాంబాబు కుమారుడు, కోడలు, మనవళ్లు కూడా రాజమహేంద్రవరంలోని ఒక ప్రయివేటు లాడ్జిలో ఆత్మహత్య చేసుకోవడం కూడా అప్పట్లో తీవ్ర కలకలం రేపింది. అదే తరహాలో మంగళవారం రాంబాబు దంపతులు ఆత్మహత్య చేసుకోవడం పలువురిని కలచి వేసింది. రాంబాబుకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు కాగా ఇద్దరు కుమార్తెలు వివాహాలు అయ్యాయి.

గురుకుల పాఠశాలలో తనిఖీలు

ప్రజాశక్తి – ముమ్మిడివరం

గురుకుల పాఠశాలలో స్థితిగతులను తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం మంగళ వారం తనిఖీ నిర్వహించింది. మండలంలోని ఠానేలంక పంచాయతీ పరిధిలోని అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల్లో స్థితిగతులను పరిశీలనకు నియమించిన ప్రత్యేక అధికారి, డిప్యూటీ కలెక్టర్ మరియు ఐసిడిఎస్ పీడీ డాక్టర్ ఝాన్సి రాణి బృందం మంగళవారం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఈ తనిఖీల్లో భాగంగా స్కూల్, హాస్టల్ మరియు కళాశాలలను నిశితంగా పరిశీలించారు. విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలను మరియు రికార్డులను పరిశీలిం చారు. అంటే కాకుండా పరిసర ప్రాంతాలను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యకు అవసరమగు మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నివేదికను కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు. ఈ బందంలో ఎపిఇడబ్ల్యూఐడిఎస్ డిపార్ట్మెంట్ డిఇ సుబ్బరాజు, ఐసిడిఎస్ సిడిపిఒ వై.విజయశ్రీ లతో పాటు పాఠశాల ప్రిన్సిపల్ టి.గంగా భవాని తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న ప్రత్యేక తనిఖీ బృందం

నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల కార్యాచరణ

- కలెక్టర్ మహేష్‌కుమార్ వెల్లడి
- 83 నీటి సంఘాలకు ఎన్నికలు

ప్రజాశక్తి – అమలాపురం

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 83 నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు 40 రోజుల కార్యాచ రణ ప్రణాళిక ప్రకారం షెడ్యూల్ విడుదల అయిందని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపా రు. జిల్లాలో 82, మేజరు, ఒక మైనర్ నీటి వినియోగ దారుల సంఘాలు ఉన్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 14 డిస్ట్రిబ్యూటరీ సంఘాలు ఉండగా వీటిలో సెంట్రల్ డెల్టాకు సంబంధించి తొమ్మిది డిస్ట్రిబ్యూటరీ సంఘాలు 56 నీటి వినియోగదారుల సంఘా ల పరిధిలో ఉన్నాయన్నారు. అదేవిధంగా తూర్పు డెల్టాకు సంబంధించి ఐదు డిస్ట్రిబ్యూటరీ సంఘాలు 27 నీటి వినియోగదారుల సంఘాల పరిధిలో ఉన్నాయన్నారు. సెంట్రల్ డెల్టాలో ఉన్న తొమ్మిది డిస్ట్రిబ్యూటరీ సంఘాల కు సంబంధించి ప్రాజెక్ట్ కమిటీకి ఎన్నికలు జిల్లా లోనే జరుగుతాయని, తూర్పు డెల్టాకు సం బంధించి ప్రాజెక్ట్ కమిటీకి ఎన్నికలు కాకినాడ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తారన్నారు. జిల్లా లోని 83 నీటి వినియోగ దారుల సంఘాల ఎన్ని కలకు సంబంధించి నోటిఫికేషన్–1 21.10.2024 విడుదల చేశారన్నారు. జిల్లాలో పూర్తి షెడ్యూల్ ఈ క్రింది విధ%శీ%గా జారీచేయడ మైనదన్నారు..సదరు ఎన్నికల ప్రక్రియ కు సంబంధించి ఓటరు జాబితా సిద్ధం చేయుటకు ప్రతి మండలానికి నీటి వినియోగ దారుల సంఘం పరిధిలో సంబంధిత తహశీల్దార్ల / డిటిను ఆథరైజ్డ్ అధికా రిగా ఆయకట్టు వివరాలు సరిచూచుటకు సంబంధిత నీటి పారుదల శాఖ తరపున సహాయ కార్యనిర్వహక ఇంజనీర్లను నియమించడం జరిగినదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

భూ సమస్యలపై అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి – యంత్రాంగం

జిల్లాలో గ్రామ రెవెన్యూ సదస్సులు మంగళవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా భూ సమస్యలపై అర్జీలను అధికారులు స్వీకరించారు.

ఆలమూరు : రైతులు తమ భూ సమస్యలపై గ్రామ రెవెన్యూ సభలను తప్పక వినియోగించుకోవాలని తహశీల్దార్ కెజె.ప్రకాష్ బాబు అన్నారు. మడికి పంచాయతీ వద్ద సర్పంచ్ ఉండ్రాజపు లక్ష్మి మౌనిక చిన్న అధ్యక్షతన ఆయన ఆధ్వర్యంలో సిబ్బందితో గ్రామ రెవెన్యూ సభ మంగళవారం నిర్వహించారు. ఇందులో సుమారు 50 మంది రైతులు తమ భూ సమస్యలపై ఫిర్యాదులు దరఖాస్తుల రూపంలో అందజేశారు.

చిలకలపాడు గ్రామ కంఠం సమస్య పరిష్కారానికి వినతి

మండలంలోని మడికి శివారు చిలకలపాడుకు చెందిన గ్రామ కంఠం సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు తహశీల్దార్ ప్రకాష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీనిపై ఆయన మా నుండి వివరాలు అడిగి తెలుసుకుని, సానుకూలంగా స్పందించారన్నారు. మడికి రెవెన్యూ పరిధిలో జరుగుతున్న సదస్సులో పరిష్కారిస్తామని ఆయన హామీ ఇచ్చారని వారన్నారు. వినతిపై సానుకూలంగా స్పందించిన తహశీల్దార్ ప్రకాష్ బాబుకి గ్రామస్తులు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు దొండపాటి సుబ్బరాజు, అడ్డాల రాజు, ఈదర రమేష్, కొత్తపల్లి నగేష్, చెల్లబోయిన శ్రీనివాస్, కొత్తపల్లి కష్ణ, ఆర్ఐ రామాయమ్మ, మండల సర్వేయర్ ప్రభావతి, కార్యదర్శి వెంకటరత్నం, గ్రామ విఆర్‌ఒలు, సర్వేయర్లు, పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** మండలంలోని నేలటూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కుక్కల వీరన్న అధ్యక్షతన జరిగిన సభలో తహశీల్దార్ పి. చిన్నారావు పాల్గొని మాట్లాడారు .భూ సమస్యలపై ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామ రెవెన్యూ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు .అనంతరం వివిధ సమస్యలపై రైతులు అందించిన దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, విఆర్‌ఒలు, సచివాలయ సిబ్బంది ,రైతులు తదితరులు, పాల్గొన్నారు.

ఆలమూరు తహశీల్దార్ ప్రకాష్ బాబుకి వినతి అందజేస్తున్న గ్రామస్తులు

ఆసుపత్రికి మంచాలు, దుప్పట్లు అందజేసిన మంత్రి

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి సిఎస్ఆర్ నిధులతో 50 మంచాలు, పరుపులు 380 దుప్పట్లను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అందించారు. ఆయన మంగళవారం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ ఆసుపత్రిలో ఉన్న బెడ్స్ కాలం చెల్లి తుప్పుపట్టాయని మంత్రి సుభాష్ దష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించి మంత్రి సుభాష్ రోగుల సౌకర్యార్థం మంచాలు, పరుపులు, దుప్పట్లను తక్షణమే సమకూర్చినట్లు డాక్టర్ ప్రవీణ్ ఈ సందర్భంగ ాతెలిపారు. కార్యక్రమంలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ ఆస్పత్రుల్లో అందుతున్న వైద్య సేవలపై తనిఖీ చేసి సంతప్తికరంగా ఉన్నాయని, ప్రభుత్వ ఆసుపత్రికి పేదలు వస్తారని వారికి మరింత నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సహాయం పై పలువురు రోగులను అడిగితెలుసుకున్నారు. తల్లిదండ్రులు లేని ఒక యువకుడు వైద్యం ఆసుపత్రిలో పొందుతూ ఉండటంతో ఆ యువకుడి నాయనమ్మ పరిస్థితి వివరించడంతో మంత్రి తక్షణమే స్పందించి తన సొంత నిధులు రూ .5వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో జనసేన ఇంఛార్జి కష్ణ, డాక్టర్ చక్రధర్, కళ్యాణ్ బాబు, ఏరియా ఆసుపత్రి సిబ్బంది, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

చల్లపల్లిలో శంకుస్థాపన చేసిన ఎంఎల్ఎ ఆనందరావు

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి – ఉప్పలగుప్తం

గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించి పల్లెలను ప్రగతి పథంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్ఎ అయితా బత్తుల ఆనందరావు అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పలు గ్రామాల్లో సిసి రోడ్లకు ఎంఎల్ఎ ఆనందరావు శంకుస్థాపనలు చేశారు. చల్లపల్లిలో రూ.20 లక్షలు సరిపల్లిలో రూ.8 లక్షలు గోపవరంలో రూ.12 లక్షలు కూనవరంలో రూ.8 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్లకు ఎంఎల్ఎ ఆనందరావు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఆనందరావు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో కనీసం పంచాయతీ నిధుల ద్వారా కూడా గ్రామాల అభివద్ధిని జరగనివ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం లో గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అభివద్ధి చేసేందుకు ప్రణాలికలు రూపొందించామన్నారు. కార్యక్రమాలలో ఆయా గ్రామాల సర్పంచ్ లు ఇసుకపట్ల జయమణి, వాకపల్లి ఈశ్వరి, టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు రాష్ట్ర టిడిపి వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, తెలుగు రైతు మండల అధ్యక్షుడు పెమ్మిరెడ్డి సత్యనారాయణ, కూటమి నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, పోలిశెట్టి శివాజీ, ఆకుల రాము తదితరులు పాల్గొన్నారు.

బివి.లంక రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి – ఆలమూరు

కొత్తపేట ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు ఈనెల 17న భూమి పూజ చేసిన మండలంలోని బడుగువానిలంక ప్రధాన రహదారికి సిసి రోడ్డు విస్తరణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పనులను స్థానిక కూటమి నాయకులు పాలూరి గోవిందరాజు, దూలం రాంబాబు, పడాల అమ్మిరాజు, తదితరులు పర్యవేక్షించారు. రూ. 30 లక్షలు ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులతో ప్రస్తుతం జెసిబి సహాయంతో 735 మీటర్ల పొడవు, 1.20 మీటర్ల వెడల్పు, 0.30 మీటర్ల లోతుతో రహదారికి రెండు వైపులా మొత్తం 8 అడుగులు వెడల్పుతో సిసి రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నట్లు ఇంజినీరింగ్ అసిస్టెంట్ వంశీ తెలిపారు. గతంలో 10 అడుగుల రోడ్డు ఉండగా దీంతో కలిపి మొత్తం 18 అడుగులు రహదారిగా అభివృద్ధి చెందుతుందన్నారు.

పనులను పరిశీలిస్తున్న కూటమి నాయకులు, అధికారులు

పలుచోట్ల ఉచిత వైద్య శిబిరాలు

వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న వెంకటయాపాలెం సర్పంచ్ సతీష్ కుమారి

ప్రజాశక్తి – యంత్రాంగం

రామచంద్రపురంలో నియోజకవర్గంలో మంగళ వారం పలుచోట్ల ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు.

రామచంద్రపురం: వెంకటాయపాలెం గ్రామం లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో 92 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరాన్ని సర్పంచ్ యల్లమెల్లి సతీష్ కుమారి మంగళవారం ప్రారంభించారు. కిరణ్ కంటి ఆసుపత్రి నిర్వహణలో కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ కళ్ళు, అన్ని అవయవాలను వాటిని కాపాడుకోవాలన్నారు. కంటి వైద్య శిబిరం లో 15 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసి, 44 మందికి కళ్ల అద్దాలు రిఫర్ చేశారు. ఈ కార్య క్రమంలో ఎపిఐడిసి మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్ , కిరణ్ కంటి ఆసుపత్రి, 104 వైద్య సిబ్బంది, ఏఎన్ఎం విజయ, విలేజ్ హెల్త్ అసిస్టెంట్ భవాని, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. మండలంలోని ఎర్ర పోతవరం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన ఎల్‌వి ప్రసాద్ ఉచిత కంటి వైద్య శిబిరంలో 75 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 18 మందికి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. అదేవిధంగా 37 మందిని కళ్లద్దాలకు ఎంపిక చేయగా ఇతర సమస్యలతో సుమారు 20 మంది హాజరయ్యారు. గ్రామస్తులు కోలా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎల్ వి ప్రసాద్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ జి.దివ్య, విజన్ టెక్నీషియన్ సుబ్రహ్మణ్యం, అడ్మిన్ శ్రావణి , తదితరులు వైద్య సేవలు అందించారు పరిసర ప్రాంతాల ప్రజలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

117 జిఒ రద్దు ప్రక్రియను వేగవంతం చేయాలని వినతి

ప్రజాశక్తి – మామిడికుదురు

విద్యాశాఖలో 117 జీవో రద్దు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా పిఆర్‌టియు సమావేశం ప్రభుత్వానికి విన్నవించింది గోగన్నమఠం యుపి స్కూల్ నందు మంగళవారం జిల్లా శాఖ అధ్యక్షులు దీపాటి సురేష్ బాబు అధ్యక్షతన జిల్లా పి ఆర్ టి యు శాఖ సమావేశం నిర్వహించారు. నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని, సకాలంలో జీతాలు చెల్లించాలని, పాఠశాలల నిర్వహణ నిధులు వెంటనే చెల్లించాలని, ఐఆర్ 30 శాతం వెంటనే ప్రకటించాలని, హైస్కూల్ ప్లస్ లకు కావలసిన సౌకర్యాలు కల్పించాలని, పిఎఫ్, ఎపి జిఎల్ఐ, మెడికల్ రీయంబర్స్మెంట్ బకాయిలు చెల్లించాలని,పెరుగుతున్న యాప్ ల భారం తగ్గించాలని తదితర అంశాలు చర్చించి తీర్మానం చేశారు విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా మిడ్డే మీల్స్ మెనూ మార్చడం పై హర్షం ప్రకటించారు. మిడే మీల్స్ వర్కర్లకు పెరిగిన ధరలకు అనుగుణముగా కుకింగ్ చార్జీలు పెంచాలని పేర్కొన్నారు ఈ సమావేశంలో పి.రాంప్రసాద్, ఎం.అమత రావు, వి.శ్రీనివాస్, బావిశెట్టి నాగేశ్వరరావు, వైవిఎస్.నారాయణ, ఎంవిఆర్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గోగున్నమఠంలో పిఆర్‌టియు జిల్లా సమావేశం

కార్టూ'నిజం'

గతి తప్పుతున్న రుతుపవనాలు

హంస వాహనంపై కోనేటి రాయుడు

ప్రజాశక్తి – ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు రెండవ రోజు మంగళవారం హంస వాహనంపై యాత్రికులకు దర్శన మిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం నుండి స్వామివారికి వేద పండితులు ఖండవల్లి ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో అర్చక బందం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, సప్త కళశారాధన, మహాస్నపనము, వసంతోత్సవము, అష్టదళ పాదపద్మారాధన ప్రధాన హోమాలు, నీరాజన మంత్రపుష్పములు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిసి చక్రధర రావు దంపతులు, లొల్ల గ్రామ సర్పంచ్ కాయల జగన్నాథం దంపతులు, మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకట రాజు దంపతులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 8 గంటలకు సరస్వతీ అలంకరణతో హంస వాహన పై కోనేటి రాయుడు ఆలయ మాడవీధుల్లో విహరించారు. ఈ కార్యక్రమాలను తిలకించేందుకు యాత్రికులు వేల సంఖ్యలో రావడంతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. వచ్చిన యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను చేశారు.

హంసవాహనంపై యాత్రికులకు దర్శనమిచ్చిన వాడపల్లి వెంకన్న

చిరు వ్యాపారులకు అవగాహన

ప్రజాశక్తి – ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని స్థానిక విష్ణాలయం సెంటర్ వద్ద చిరు(వీధి) వ్యాపారుల సమావేశం మంగళ వారం కొయ్యల దుర్గారావు అధ్యక్షతన జీవనోపాదుల పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు మెప్మా (సిటి మిషన్ మేనేజర్) భాస్కర రావు హాజరై మాట్లాడారు. చిరుర(వీధి) వ్యాపారుల నుద్దేశించి మాట్లాడుతూ చిరు (వీధి) వ్యాపారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు జాతీయ జీవనోపాదుల పథకం ఎంతో దోహదం చేస్తుందని అన్నారు. కేంద్రం చిరు వ్యాపారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రవేశపెట్టిన జాతీయ జీవనో పాదుల పథకం ద్వారా వ్యాపార అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తుందన్నారు. వీటిని వ్యక్తిగతంగానూ, సంఘటితంగా పొంది వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిఒ నాగరాజేశ్వరి మరియు వ్యాపారులు చికురుమిల్లీ కృష్ణయ్య సంసాని వెంకట్రావ్ మునికోటి రాంబాబులతో పాటు పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు, వ్యాపారులు

నేరాలు ఘోరాలు

ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - కరప

మండలంలోని పెనుగుదురు ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పులుపకూర సునీత మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ప్రస్తుతం ఆమె కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. బాధితురాలు భర్త తెలిపిన వివరాల మేరకు.. గత మూడు నెలలుగా జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బండారు మురళి, గంట నానిబాబు, గుబ్బల భవాని తన భార్య సునీతను ఫీల్డ్ అసిస్టెంట్‌గా తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ప్రతినెల తమకు డబ్బులు ఇవ్వాలని బెదిరిస్తున్నారని ఆయన ఆరోపించారు. దీంతో మనస్థాపానికి గురియైన తన భార్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనకు కారకులైన వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జనసేన నాయకులు బండారు మురళి, ఘంటా నానిబాబు ఈ ఆరోపణలను ఖండించారు. ఉపాధి పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ పలు అవకతవకలు పాల్పడుతున్నారని ఉపాధి కూలీలు ఈ నెల 5వ తేదీన డ్వామా పీడీకి ఫిర్యాదు చేశారని తెలిపారు. రెండు రోజుల్లో అధికారులు విచారణ చేపట్టేందుకు రానున్నారని వారు తెలిపారు. ఈ మేరకు కరప పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన అడవి పంది వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎడిబి రోడ్డు సూరంపాలెం జంక్షన్ వద్ద సోమవారం రాత్రి అడవి పంది బైకును ఢీకొట్టిన ప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చున్న వ్యక్తి అక్కడక్కడే మతి చెందాడని పోలీసులు తెలిపారు. పెద్దాపురం పట్టణానికి చెందిన చాలా కామరాజు తన ఎలక్ట్రిక్ బైక్‌పై రాజమహేంద్రవరం నుంచి పెద్దాపురం వస్తుండగా మార్గమధ్యలో కాకినాడ సమీపంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన రంపం నాగేశ్వరరావు బైకు ఎక్కాడు. ఇద్దరూ బైక్ పై వస్తుండగా సూరంపాలెం సెంటర్ వద్ద అడవి పంది ఈ బైక్‌ను ఢీ కొట్టిందని, బైక్‌పై ఉన్న ఇద్దరూ క్రింద పడిపోగా వెనుక కూర్చున్న నాగేశ్వరరావు అక్కడ అక్కడే మృతి చెందాడని, బైక్ నడుపుతున్న కామరాజు తీవ్రంగా గాయపడ్డాడని పోలీసులు తెలిపారు. ఎస్ఐ వి.మౌనిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరిలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కాట్రేనికోన

మురమళ్ళ నుంచి కుండలేశ్వరం ఏటుగట్టుపై ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు గోదావరిలో పడి ఒక వ్యక్తి మరణించాడు. కాకినాడకు చెందిన కాకర్ల ప్రసాదరావు (60) కాకినాడ నుండి కుండలేశ్వరానికి సమీపంలో ఉన్న చెరువుల వద్దకు ప్రతిరోజు వస్తుంటారు. దీనిలో భాగంగా సోమవారం తెల్లవారుజామున మోటార్ సైకిల్ పై కాకినాడ నుంచి చెరువుల దగ్గరికి వస్తుండగా ప్రమాదవశాత్తు వియర్ (వైర్) వద్ద నీటిలో పడిపోయారు. ఈయన నుండి సమాచారం లేకపోవడంతో బంధువులు వెతకడం ప్రారంభించారు. కొండలేశ్వరం వద్ద మంగళవారం మతదేహం లభించడంతో ప్రమాదం ఏ విధంగా జరిగింది అన్న తీరుపై ఆరా తీస్తున్నారు. ప్రసాద్ రావు కనిపించడం లేదంటూ కాకినాడ జిల్లా ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో కాకినాడ జిల్లా ఇంద్రపాలెం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మతదేహాన్ని కాకినాడ తరలించారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - ఆలమూరు

బంగారు నగలను చోరీ చేసిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని ఈ నెల 17న జొన్నాడకు చెందిన చిటికెన సోమరాజుకు చెందిన తాళం వేసిన ఇంటిలోని కబోర్డ్ నందు ఉంచిన 40 కాసుల బంగారు వస్తువులు గుర్తు తెలియని దుండగులు అపహరించారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టిన విషయం విదితమే. ఈ మేరకు దర్యాప్తులో మంగళవారం ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. సిఐ సిహెచ్.విద్యాసాగర్, ఎస్ఐ ఎం.అశోక్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఏలేశ్వరం లోని ప్రస్తుత కాలేజీ రోడ్లో జి.భీమవరం వన్‌టౌన్ పరిధి, బ్రాహ్మణ వీధికి చెందిన పందిరి వెంకటనారాయణ అలియాస్ నారిగాడు, బుజ్జి(32), నెల్లూరులోని షాదీ మందిర్ దగ్గర కోటమెట్టకు చెందిన షేక్‌అహ్మద్ బాషా(42) తాళం వేసిన ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. వారి కదలికలను పసిగట్టిన తమ సిబ్బంది ఇద్దరు నిందితులను జొన్నాడ సెంటర్ వద్ద పట్టుకున్నారు. వారి వద్ద నుంచి బంగారం వస్తువులను రికవరీ చేసి, అరెస్టు చేసినట్లు తెలిపారు. నిజానికి దొంగలించబడింది 312 గ్రాములు బంగారు వస్తువులు, రెండు రోల్డ్ గోల్డ్ గాజులు కాగా వారి వద్ద 121 గ్రాములు బంగారం వస్తువులు, రెండు రోల్డ్ గోల్డ్ గాజులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును చేధించిన అధికారులను కొత్తపేట డిఎస్‌పి వై.గోవిందరావు అభినందించారు. ఇందులో సిఐ సిహెచ్.విద్యాసాగర్, ఎస్ఐ ఎం.అశోక్, హెచ్‌సి సుబ్రహ్మణ్య స్వామి, పోలీసులు బ్లేసన్, గంగాధర్, రాంబాబు, నెహ్రు, శ్రీనివాసరావు, రవికుమార్, చిట్టిబాబు ఉన్నారు.

విద్యార్థిని మృతిపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ఆలమూరు

ఒక విద్యార్థిని మరణంపై ఆమె తండ్రి స్థానిక పోలీస్ స్టేషన్లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఎం.అశోక్ తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని మడికి శివారు చిలకలపాడుకు చెందిన చెక్కపల్లి బాబీ తన రెండవ కుమార్తె చెక్కపల్లి వెన్నెల చెముడులంక శ్రీ షిర్డీ సాయి విద్యానికేతన్(ఇఎం) స్కూల్లో పదవ తరగతి చదువుతోంది. అయితే స్కూల్లో దసరా సెలవలు ఇవ్వటం లేదని, ఈనెల 6న వెన్నెల జిల్లా కలెక్టర్‌కు నా సెల్ నుండి సమాచారం అందజేసింది. జిల్లా కలెక్టర్‌కు సమాచారం ఇచ్చినందుకు స్కూల్ డైరెక్టర్ ఉమారాణి నా కుమార్తె వెన్నెలని టార్చర్ చెయ్యడం వల్ల మనస్తాపానికి గురై ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అంతేకాకుండా మరో కారణంగా విద్యార్థి వెన్నెలను 10వ తరగతి పాస్ కాకండా చేస్తానని యాజమాన్యం భయపెట్టడం వల్లే నా కూతురు మనస్తాపంతో చనిపోయిందన్నారు. ఇక మీదట భవిష్యత్తులో ఏ విద్యార్థినికి ఇలాంటి పరిస్థితి రాకూడదని తండ్రి బాబి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

ఆక్రమణల చెరలో పంచాయతీ చెరువు

- నిర్వహణ లోపంతో కుచించుకుపోతున్న చెరువు
- తాగునీటి చెరువుగా మారిస్తే మహర్దశ

శివకోటి గ్రామ పంచాయతీ చెరువు

ప్రజాశక్తి - రాజోలు

రాజోలు మండలం శివకోటి గ్రామం రాజోలు మండలంలో మేజర్ పంచాయతీల్లో ఇది ఒకటి. అలాంటి శివకోటి పంచాయతీ చెరువు ఆక్రమణకు గురవుతోంది. రూ.లక్షలు విలువ చేసే చెరువు భూమి కనుమరుగవుతోంది. పాలక వర్గం ఏర్పడి 4 సంవత్సరాలు గడుస్తున్నా ఆక్రమణలపై దృష్టి పెట్టలే కపోతున్నారు. చెరువు సుమారు 7 ఎకరాలు ఉండగా క్షేత్ర స్థాయిలో ఆక్రమణలతో చెరువు విస్తీర్ణం తగ్గిపోయింది. కొందరు ప్రయివేటు వ్యక్తులు చెరువును ఆక్రమణకు గురిచేశారు. ఆక్రమణలతో పూడుకుపోయాయి. ఆక్రమణకు గురైన చెరు వుల భూవిస్తీర్ణం లక్షల్లో ఉంటుంది.

నిర్మాణాలతో ఆక్రమణలకు గురవుతున్న చెరువు

శివకోటి గ్రామ పంచాయతీ చెరువును కొందరు ప్రయివేటు వ్యక్తులు ఆక్రమణలు చేశారు. ఏడు ఎకరాల్లో విస్తరించి ఉన్న పంచాయతీ చెరువు ఆక్రమణకు గురైంది. సుమారు నాలుగుఎకరాలు మాత్రమే చెరువుగా మిగిలి ఉంది. చెరువులకు సంబంధించి ఆక్రమణల విలువ సుమారు రూ లక్షల ఉంటుందని అంచనా. భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకుని చెరువులను సంరక్షించాల్సిన ప్రభుత్వమే సొంత కార్యాలయాలను నిర్మిస్తోంది. ప్రయివేటు వ్యక్తులు ఆక్రమణలు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెరువుకు ఆనుకుని పంచాయతీ స్థలంలో చాలా పక్కా నివాస గహాలు వెలిశాయి. దీంతో చెరువు రోజు రోజుకు కుచించుకు పోతుంది. చెరువుకు ఆనుకుని నివాస గృహాలతో పాటు చెత్త చెదారం, పశువుల పాకలు, గృహోపకరణ వస్తువులతో చెరువును కబ్జా చేస్తూ చెరువుకు మనుగడ లేకుండా చేస్తున్నారు. చెరువు రోజురోజుకీ చుట్టు పక్కల ఉన్న వారంతా చెత్త, వ్యర్థాలతో కప్పేస్తూ మొక్కలు వేయడంతో చెరువు వైశాల్యం భారీగా తగ్గి పోయింది. దీంతో పాటూ స్థానిక నివాసాలవారు ఇళ్లలో మురుగునీటి గొట్టాలు, మరుగుదొడ్ల నుంచి వచ్చే పైపులు సైతం చెరువులోకి వదిలేయడంతో దుస్థితి అధ్వానంగా మారింది. పంచాయతీ పరిధిలోని చెరువుతో పాటు అనేకమైన స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి. వాటిని స్వాధీనం చేసుకొంటే గ్రామం మరింత అభివృద్ధి చెందడంతో పాటు ఆదాయం సమకూరుతుందని గ్రామస్థులు అంటున్నారు.

ప్రణాళికలు రూపొందించిన అభివృద్ధికి నోచుకోని వైనం

గతంలో శివకోటి పంచాయతీ చెరువును తాగునీటి చెరువుగా మార్చి ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని, ఈ చెరువు ఆధునీకరణకు గత ప్రభుత్వ హయాంలో ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టుగా మార్చేందుకు ప్రణాళిక రూపొందించి నిధులు మంజూరు చేసినా అభివృద్ధికి నోచుకోలేదు. స్థానిక పథకాలను ఇటీవల వాటర్ గ్రిడ్ లోకి మార్చడంతో చెరువుల ఆధునీకరణ పక్కన పెట్టేశారు. దీంతో వీటి దుస్థితి అధ్వానంగా మారింది. ఈ ప్రభుత్వంలోనైనా శివకోటి పంచాయతీ చెరువును తాగునీటి ప్రాజెక్టుగా మార్చుచేస్తే శివకోటి గ్రామంతో పాటు చుట్టు ప్రక్కల ఉన్న చింతలపల్లి, కూనవరం, రాజోలు, మట్టపర్రు వంటి గ్రామాలకు కూడా తాగునీటిని సరఫారా చేయవచ్చు. చెరువును సమగ్రంగా సర్వే చేసి ఆక్రమణలను తొలగించి చెరువును సంరక్షించి తాగునీటి ప్రాజెక్టుకు అడుగులు పడితే శివకోటి గ్రామానికే మహర్దశ వస్తుంది.

చెరువును తాగునీటి ప్రాజెక్టుగా మార్చు మేలు

పదేళ్ల క్రితం శివకోటి పంచాయతీని తాగునీటి చెరువుగా తీర్చి దిద్దడానికి ప్రతిపాదనలు చేశారు. కాని కార్యరూపం దాల్చలేదు. దీంతో పంచాయతీ చెరువు రోజు రోజుకీ చుట్టుపక్కల ఉన్న వారంతా చెత్త, వ్యర్థాలతో కప్పేస్తూ మొక్కలు వేయడంతో చెరువు వైశాల్యం భారీగా తగ్గిపోయింది. ఈ చెరువును తాగునీటి ప్రాజెక్ట్‌గా తయారు చేస్తే గ్రామ ప్రజలతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాలకు దాహార్తి సమస్య తీరుతుంది.

-ఆరుమిల్లి భాను, వార్డు మెంబర్, శివకోటి

సర్వే చేయించి స్వాధీనం చేసుకుంటాం

భూ సర్వే వల్ల ఆక్రమణలు కొన్ని బయటపడతాయి. పంచాయతీ తీర్మానం చేసి చెరువును సర్వే చేయిస్తాం. శివకోటి పంచాయతీ చెరువును సర్వే చేయించి ఆక్రమణలు ఒక్కొక్కటిగా స్వాధీనం చేసుకుంటాము. తద్వారా తాగునీటి ప్రాజెక్టు కొరకు ముందడుగు వేయవచ్చు. శివకోటి గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రజలు అంతా సహకరించాలని కోరుతున్నాను.

-ఎం.సూర్యప్రకాష్, పంచాయతీ కార్యదర్శి, శివకోటి

నివాసాల మధ్య మద్యం షాపు తొలగించాలి

మహిళల డిమాండ్

ప్రజాశక్తి -మామిడికుదురు

మండలంలోని పాశర్లపూడి ఏరియా బొమ్మిడిపాలెంలో నివాస గృహాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం షాపును తొలగించాలంటూ మహిళలు మంగళవారం డిమాండ్ చేశారు. నివాస గృహాల మధ్య మద్యం షాపు ఏర్పాటుతో నిత్యం త్రివ ఇబ్బందులు పడుతున్నామని మహిళలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు మద్యం షాపును నివాస గృహాలకు దూరముగా తరలించాలని దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని మహిళలు అన్నారు. రాజోలు ఎక్సయిజ్ సిఐ ఎదుట మద్యం షాపు దూరముగా తరలించాలంటూ మహిళలు నిరసన వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న ఎంపిపి పి.నాగమణి

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

రెవెన్యూ అధికారులు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కె.గంగవరం మండల పరిషత్ అధ్యక్షులు పంపన నాగమణి విజ్ఞప్తి చేశారు. మండలం లోని ఎర్రపోతవరం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకి ముఖ్యఅతిథిగా హాజరై ఆమె ప్రసంగించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి దూడల నాగేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ కె.మురళీకష్ణ, ఆర్ఐ నరాల వెంకటరావు, సర్వేయర్ పావని, పంపన సుబ్బారావు, రెవెన్యూ సిబ్బంది, రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తి

కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తిచేశామని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నం దు జిల్లాస్థాయి కొనుగోలు కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించి సన్నద్ధత చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు 370 కేంద్రా లు ఏర్పాటు చేశారన్నారు. ఖరీఫ్ 2024-25 రైతులు ఆరుగాల శ్రమించి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధరలు కల్పించాలనే లక్ష్యంతో ధాన్యం సేకర ణలో నాణ్యత ప్రమాణా లకు లోబడి వున్న ధాన్యానికి కనీస మద్దతు ధర కల్పిస్తామన్నారు. జిల్లాలో 370 ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతు సేవ కేంద్రాలలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ముందుగా ఆలమూరు మండపేట మండలాల్లో నవంబర్ మొదటివారంలో ధాన్యం నూర్పిళ్ళు జరిగే అవకా శం ఉందన్నారు. తొలుతగా కేంద్రాలను మండలాలలో ప్రారంభించాలన్నారు క్రాప్ కటింగ్ ఎక్స్పరిమెంట్ ఆధారంగా దిగుబడులను గణించడం జరుగుతుందన్నారు. రెవెన్యూ సిబ్బందిని కస్టోడియన్ అధికారులుగా మిల్లుల వద్ద నియమించాలని ఆదేశించారు సచివాల య సిబ్బందిని జిపిఎస్ ట్రాకింగ్ మానిటరింగ్ కొరకు నియమించాలన్నారు. అవసరమైన వాహనాలను డిటిఒ సహకారంతో జిపిఎస్ కోఆర్డినేటర్లతో ఏర్పాటు చేసుకోవాలన్నారు ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిబ్బందిని నియమించుకొని డివిజన్ మండల స్థాయిలలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు ధాన్యం కొనుగోలు ప్రక్రియలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కమాండ్ కంట్రోల్ రూమ్ తోపాటు గా టెలికాన్ఫరె న్స్ లు నిర్వహిస్తారన్నారు. ధాన్యం సేకరణకు అవసరమైన గోను సంచులను, హమలి లను, రవాణా వాహనా లను ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందన్నారు. వీటిని రైతులే సమకూ ర్చుకుంటే అందుకయ్యే వ్యయాన్ని కూడా ప్రభు త్వమే నేరుగా రైతు ఖాతాలలో జమ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జెసి టి.నిషాంతి, ఆర్‌డిఒలు, జిల్లా కో ఆపరేటివ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ కనీస మద్దతు ధరల వివరాలు

ఖరీఫ్ 2024-25 కనీస మద్దతు ధర క్రింద సాధారణ రకం క్వింటా దాన్యం రూ.2300లు, 75 కేజీల ధాన్యానికి రూ.1725లు. గ్రేడ్ ఏ రకం క్వింటా ధాన్యం రూ.2320, 75 కేజీల ధాన్యానికి రూ.1740లు గా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

రైస్ మిల్లర్ అసోసియేషన్‌తో సమావేశం

మంగళవారంస్థానిక కలెక్టరేట్లో జిల్లాలో ఉన్న రెండు రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రతిని ధులతో సమావేశమై ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో ధాన్యం కొనుగోలు ప్రక్రి యపై జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సమీక్షించారు. ఈ సందర్భంగా మిల్లర్లు భారత ఆహార సంస్థకు లెవీ సేకరణ లో ఉన్న సమస్యలు గోదాముల సమస్యలు గోనెసంచులు తిరిగి మిల్లులకు చేరకపోవడం వంటి జిల్లాను యూనిట్ గా చేయడం లక్ష్యాలు నిర్దేశించడం, రా, రైస్ మిల్ బాయిల్ రైస్ మిల్ లకు విడివిడిగా లక్ష్యాలు నిర్దేశించాలని సీఎంఆర్ జనరేట్ లివి అంశాల్లో సమస్యలను పరిష్కరించాలని మిల్లర్లు ముక్తకంఠంతో అధికారులను కోరారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మిల్లర్లు సూచించిన పలు సమస్యలను క్షేత్రస్థాయిలో విచారించి అమలు విధానంలో ఉన్న గ్యాప్ లను పరిష్కరిస్తామన్నారు. రైతులు మిల్లర్ల కమిటీలు ఏర్పాటు చేసి ఇద్దరి సమన్వయంతో పారదర్శకంగా కొనుగోలు ప్రారంభించి కనీస మద్దతు ధరలు కల్పిస్తామన్నారు. అంతిమంగా ఆరుగాలం శ్రమించి పండిం చిన రైతుకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నదే ప్రభుత్వ ప్రధానోద్దేశ్యం అన్నారు. జెసి టి.నిషాంతి మాట్లాడుతూ మిల్లు వద్ద వాహనాలు నిలిచి పోతే ఆన్లైన్ సాఫ్ట్వేర్ ద్వారా తెలుస్తుందని అటువంటి జాప్యాలు, తేమశాతం 17 గా ఉంటే తరుగు ఉండదని 18 శాతం ఉంటే ఒక కేజీ, 19 శాతం ఉంటే రెండు కేజీలు 20 శాతం ఉంటే మూడు కేజీలు, 21 శాతం ఉంటే నాలుగు కేజీలు 22 శాతం ఆ పైబడి ఉంటే గరిష్టంగా ఐదు కేజీలు మాత్రమే తగ్గించాలని అంతకుమించి తరుగును తగ్గించినా, మిల్లులు నిబం ధనలకు విరుద్ధంగా ఉన్న ఆయా రైస్ మిల్లర్లును బ్లాక్ లిస్టులో పెట్టడం తో పాటు అప రాధ రుసుము కూడా విధిస్తామన్నారు. ఎపి రైస్ మిల్లర్స్ చట్ట ప్రకారమే రైస్ మిల్లులు అన్ని నిబంధనలతో కొనసాగాలని ఆమె స్పష్టం చేశారు సమావేశంలో మండపేట ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, ఆర్‌డిఒలు, డిఎం సివిల్ సప్లయిస్ బాల సరస్వతి, డిఎస్ఒ ఉదయ భాస్కర్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సిహెచ్ వివి.చౌదరి, డి.లక్ష్మీ నారాయణ, దుర్గారావు, నారాయణ రెడ్డి తదితరుల పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మంత్రి సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న మంత్రి సుభాష్

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరం మండలం పాతకోట గ్రామంలో కోసూరి సుబ్బారావు అనే వ్యక్తి ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో మరణించారు. ఆ కుటుంబం ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న విషయం తెలుసుకున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ.20 వేల సాయం అందజేశారు. భార్య కోసూరు సత్యవేణి, పిల్లలు నాగ దుర్గ, మణికంఠ లకు ఈ మొత్తం మంత్రి అందజేశారు. అదేవిధంగా పిల్లలకు చదువు నిమిత్తం అయ్యే ఖర్చును తానే భరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలోని గ్రామ పెద్దలు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిటిడి కళ్యాణ మండపం వినియోగానికి చర్యలు

ఎంఎల్ఎ దేవవరప్రసాద్

ప్రజాశక్తి - మామిడికుదురు

మామిడికుదురులో నిర్వహణ లోపముతో నిరుపయోగంగా మారిన టిటిడి కళ్యాణ మండపాన్ని వినియోగంలోకి తీసుకు వచ్చే దిశగా చర్యలు చేపడతానని రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. ఎంఎల్ఎ మంగళవారం కళ్యాణ మండపాన్ని పరిశీలించారు మండపం సీలింగ్ పడిపోయిందని, ఈ దర్శనం కౌంటర్ రద్దు చేశారని, వినియోగంలోకి లేక సుదూర ప్రాంతాలు వెళ్లి ఈ ప్రాంత వాసులు అవస్థలు పడుతున్నారని స్థలదాత వారసుడు ఈలి శ్రీనివాసరావు ఎంఎల్ఎకి వివరించారు. దీనిని పూర్తిస్థాయిలో ఆధునికీకరించి వినియోగంలోకి తీసుకువస్తానని ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ తెలిపారు.

పబ్లిక్ నోటీసు

ఇందుమూలంగా ఈ ప్రకటన పూర్వకంగా యావన్మంది ప్రజలకు తెలియచేయునది ఏమనగా,

నా క్లయింటు, పిఠాపురం పట్టణ కాపురస్తులు, సాయిబాబా గుడి వీధి డో.నెం. 4-2-8 కోట శ్రీనివాస్ గారి భార్య నూకరత్నం, కుమారుడు శ్రీరామచంద్రమూర్తి, వారి తాలూకు రిజిస్టర్డ్ శెటిల్‌మెంటు దస్తావేజు నెం. 12270/2022 ఒరిజినల్స్ జిరాక్స్ నిమిత్తం కోటగుమ్మం సెంటర్‌కు వెళుచుండగా పడిపోయినవి. మా క్లయింట్లు వెంటనే ఎంత వెతికినను దొరకలేదు. కావున సదరు దస్తావేజులు ఎవరికైనను దొరికినచో వెంటనే నా క్లయింటు పై అడ్రస్ నందు గాని లేదా ఈ క్రింది లాయరు గారి అడ్రస్ నందు గాని అప్పగించవలెను. సదరు దస్తావేజు రీత్యా ఎవరైనను ఎటువంటి లావాదేవీలు జరిపినచో అవి ఏమియు నా క్లయింట్సును బైండు చేయవనిని మరియు నా క్లయింట్సు తీసుకునే సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు వారే పూర్తి బాధ్యత వహించవలసి ఉంటుంది.

బి.ఎ.కె.ఈశ్వర్‌బాబు, అడ్వకేట్
డో.నెం. 2-3-67, కొత్తపేట
పిఠాపురం-533450
సెల్: 9491010818
పిఠాపురం
22-10-2024

జనసేన, టిడిపి జెండా స్థూపాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

మండంలోని సరిపల్లిలో ఏర్పాటు చేసిన జనసేన, టిడిపి జెండా స్థూపాలను మంగళవారం మంగళ వారం ఎంఎల్ఎ అయితా బత్తుల ఆనందరావు ఆవిష్కరించారు. స్థూపా లపై పార్టీల జండాలను ఎంఎల్ఎ ఆనందరావు జనసేన నాయకులు కల్వకొలను తాతాజీలు ఎగురవేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, అరిగెల నానాజీ, అయితాబత్తుల ఉమా మహేశ్వరరావు, ఆకుల సూర్య నారాయణమూర్తి, ఏడిద శ్రీను, లింగోలు పండు,చిక్కం సుధారాణి, ఆకుల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే శ్రీకాంత్ అరెస్ట్: వైసిపి నాయకులు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ ను కేవలం రాజకీయ కక్షతోనే అరెస్టు చేశారని వైసిపి నాయకులు అన్నారు. ఉప్పలగుప్తం అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో మంగళవారం వైసిపి మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు.ఎటువంటి నేరచరిత్ర లేని విశ్వరూప్ ను రాజకీయంగా ఇబ్బందులకు గురి చేయాలన్న ఉద్దేశంతోనే రెండేళ్ల క్రితం జరిగిన ఓ హత్య కేసులో శ్రీకాంత్ ను ఇప్పుడు అరెస్టు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం పాలనను పక్కనపెట్టి రాజకీయ ప్రత్యర్థులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికల్లో తన తండ్రి విశ్వరూప్ కు పార్టీ కార్యకలాపాల్లో క్రియాశీలకంగా పాల్గొన్నాడన్న అక్కసు తో శ్రీకాంత్ ను ఇప్పుడు కూటమి ప్రభుత్వం వేధిస్తుందన్నారు. కుట్రలతో కేసులు పెట్టి వేధించినా తమకు న్యాయస్థానాలపై నమ్మకం ఉందని తప్పక న్యాయం గెలుస్తుందని అన్నారు. సమావేశంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, సర్పంచ్ ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజు, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షులు చిక్కం బాలయ్య, ఎస్‌సి సెల్ విభాగం మండల అధ్యక్షుడు పోతుమూడి కొండ బాబు, నాయకులు చీకట్ల కిషోర్,దంగేటి దొరబాబు, భోగిశెట్టి నర్సింగ్, మారిశెట్టి పుండరీకాక్షుడు, మానే శ్రీను, ఒగూరి విజయకుమార్, చేట్ల విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు..

'విద్యా ప్రవేశ్' ఎండ్‌లైన్ పరీక్ష నిర్వహణ

ప్రజాశక్తి - కాట్రేనికోన

మండల పరిధిలో పల్లం ఎంపిపిపాఠశాలలో మంగళవారం ఒకటవ తరగతి విద్యార్థులకు విద్యా ప్రవేశ్ ఎండ్‌లైన్ టెస్ట్‌ను నిర్వహించారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా పల్లం, చిర్రయానం, బహ్మసమేథ్యం పాఠశాలలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ ఏడాది జూన్‌లో బేస్‌లైన్ పరీక్షను నిర్వహించగా 90 రోజుల కార్యక్రమం అనంతరం ఎండ్‌లైన్ టెస్ట్‌ను నిర్వహించారు. ఎండ్‌లైన్ టెస్ట్ నిర్వహణా తీరును డిప్యూటీ కలెక్టర్, సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు, అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబులు పరిశీలించారు. మధుసూధనరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చేందుకు ఉద్దేశించిన విద్యాప్రవేశ్ 90 రోజుల కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా సాగిందన్నారు. న్యూ ఎడ్యుకేషన్ పాలసీ -2020, నిపుణ్‌భారత్‌లో భాగంగా ఒకటవ తరగతి బోధన చేసే ఉపాధ్యాయులకు ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యుమరసీలో ఆరు రోజుల పాటు రెసిడెన్షియల్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 1,285 మంది ఉపాధ్యాయులకు 14 బ్యాచ్‌ల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మొదటి బ్యాచ్ శిక్షణ ప్రారంభమైనట్లు ఆయన తెలిపారు. అనంతరం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎం.వెంకటరమణ, జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మీనాకుమార్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మల్లాడి తేజేశ్వరి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పల్లం ఎంపిపి పాఠశాల్లో విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

CHANGE OF SUR NAME

I, URRINKALA SURESH (NEW SURNAME), S/o Abbulu" Previously called "VARINKALA SURESH (OLD SURNAME)" Dr.No.2-89, Gouda Ramalayam Street, Sankarapuram Village, Nidadavole Mandalam, W.G. Dist.,-534301 (Now E.G.District), AP., Have changed my name "VURINKALA SURESH (OLD SURNAME) to "URRINKALA SURESH" Hence ofter all my Documents and Correspondence will be continue With my new surname URRINKALA SURESH.

ORder 21, Rule 66 నోటీసు

మహారాజశ్రీ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు, ముమ్మిడివరం

E.P. 6/2022 in O.S. 12/2021

Between:

గోకవరపు శ్రీ రామ సత్య భాస్కరరావు -పిటీషనరు/ DHr

మరియు

చవ్వాకుల వెంకట కృష్ణ -రెస్పాండెంటు/ JDr

To:

చవ్వాకుల వెంకటకృష్ణ, S/o. పట్టాభిరామయ్య, మురమళ్ళ, ఐ.పోలవరం మండలం.

పై నంబరు దావాలో మీకు ఎన్ని పర్యాయములు సేల్ నోటీసులు జారీ చేసినను మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు ది. **28-10-2024వ తేదీనకు వాయిదా వేసియున్నారు. కావున మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయి మీ అభ్యంతరములు తెలియజేయవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

కొండేపూడి లక్ష్మీ వరప్రసాదరావు
అడ్వకేటు, డో.నెం.14-309/3
సబ్ ఎలక్ట్రికల్ బోర్డు ఎదురుగా
ముమ్మిడివరం, సెల్: 9948302179
ముమ్మిడివరం
22-10-24

మహారాజశ్రీ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ముమ్మిడివరం వారి కోర్టులో

I.A. No. 17/2024 in O.S. No. 40/2018

Between:

Moka Venkateswara Rao and another -పిటీషనర్లు/ వాదులు

AND

Pulapakura Chittiyya (died) and others -రెస్పాండెంట్స్/ ప్రతివాదులు

To:

R-5: Mudiduddi Bujji, W/o. Dorababu, Cheyyeru Village, Katrenikona Mandal, MMD, Jr.C.J.

R-6: Pulapakura Durga, D/o. Chittiyya, I.Polavaram Village, I.Polavaram Mandal, MMD, Jr.C.J.

ఈ పై నెంబర్ దావాలో మిమ్మల్ని ప్రతివాది యొక్క వారసులుగా జాయిన్ చేయమని పై కోర్టులో పై నెంబర్ పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసులు నిమిత్తం మరియు మీ హాజరు నిమిత్తం వాయిదా **25-10-2024వ తేదీ అయి ఉన్నది. కావున మీరు వాయిదా రోజు ఉదయం 10.30 గం॥ ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ వారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. అట్లు కాని యెడల మీ పరోక్షమందున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)

శ్రీ కుచ్చర్లపాటి తాతంరాజు
శ్రీ గుత్తుల శ్రీనివాసరావు
అడ్వకేట్స్, ముమ్మిడివరం
సెల్: 9440041751
9440528135
ముమ్మిడివరం
ది.23-10-2024